సాక్షి సిద్దిపేట

బుధవారం ı 20 ı ఆగస్టు ı 2025



ముస్తాబవుతున్న గణనాథులు

జహీరాబాద్‌లోని రంజోల్‌లో పెద్ద ఎత్తున గణనాథులను తయారు చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



జర పైలం

చెంతనే విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో వర్షాల వేళ రైతులు జాగ్రత్తగా ఉండాలి.

వివరాలు 9లో ▸

కురుస్తున్న వర్షాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా మంగళవారం వర్షాలు కురిశాయి. సగటున 20.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అత్యధికంగా మిరుదొడ్డి మండల కేంద్రంలో 49మి.మీ., తొగుట మండలం రాంపూర్‌లో 45.5మి.మీ., కుకునూరుపల్లి మండలం తిప్పారంలో 44.5మి.మీ., జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లిలో 38.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

న్యూస్‌రీల్

హాట్ స్పాట్‌లపై నిఘా ముమ్మరం

సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: హాట్ స్పాట్‌లను రోజుకు మూడు, నాలుగు సార్లు సందర్శించి, మరింత నిఘా పెంచాలని సీపీ అనురాధ తెలిపారు. షీ టీమ్, భరోసా సెంటర్ సిబ్బందితో సీపీ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షీ టీమ్.. మహిళలు, బాలికలకు రక్షణ కవచంగా పనిచేయాలన్నారు. సంబంధిత ఏసీపీలు వారానికి ఒకరోజు షీటీమ్ కార్యక్రమాలపై మానిటర్ చేయాలన్నారు. సమావేశంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి



వంటిమామిడిలో యూరియా బ్యాగ్‌లను పరిశీలిస్తున్న స్వరూపరాణి

ములుగు(గజ్వేల్): ఫర్టిలైజర్ దుకాణ యజమానులు యూరియాను పక్కదారి పట్టించి, కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి స్వరూపరాణి హెచ్చరించారు. వంటిమామిడిలోగల పలు ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా బ్యాగ్‌లను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. నకిలీ మందులు విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు.


వేగంగా ఇందిరమ్మ ఇళ్ల చెల్లింపులు చేపట్టాలి



జూమ్ ద్వారా మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిని ఎప్పటికప్పుడు ఫొటో తీసి ఆన్‌లైన్‌లో పొందుపరిచి, లబ్ధిదారులకు వేగంగా చెల్లింపులు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ జూమ్ మీటింగ్ ద్వారా అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. వేగంగా నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇంకా ప్రారంభించని చోట త్వరగా ప్రారంభించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు నగేశ్, స్వామి, తదితర అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన దరిపల్లి చంద్రం



మంత్రితో మాట్లాడుతున్న దరిపల్లి చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మంత్రి వివేక్‌ను పీసీసీ సభ్యుడు, భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం నగరంలో మంగళవారం కలిసినట్లు పార్టీ నాయకుడు రవితేజ తెలిపారు. రాష్ట్రంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దరిపల్లి చంద్రం కోరినట్లు తెలిపారు. అదేవిధంగా 50 ఏళ్లు ఉన్న భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రతి నెలా రూ.5వేల పెన్షన్‌ను అందించాలని విన్నవించినట్లు తెలిపారు. కార్మికుల పిల్లలకు విద్యలో స్కాలర్‌షిప్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ.10 లక్షలు, సాధారణ మరణమైతే రూ.2 లక్షలు, అంగవైకల్యం కలిగిన కార్మికులకు రూ. 3 లక్షలను ఇవ్వాలని మంత్రిని, కార్మిక శాఖ కమిషనర్ గంగాధర్‌ను దరిపల్లి చంద్రం కోరారన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెలిమిల రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నట్లు తెలిపారు.



మత్తడి దూకుతున్న రాచకట్ట జలాశయం

మత్తడి ఉరకల్లు

జగదేవ్‌పూర్ మండలం తిగుల్, రాయవరం గ్రామాల మధ్య రాచకట్ట జలాశయం నిండి మత్తడి దూకుతోంది. రాచకట్ట జలాశయం సమీపంలో వరి పంటలు మునిగిపోయాయి. చేబర్తి పెద్ద చెరువు నిండి రాచకట్ట జలాశయంలోకి నీరు భారీగా వస్తోంది. అలాగే ధర్మారంలో బొరబండ ప్రాజెక్టు నిండి కళకళలాడతోంది. కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)



మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లోకి పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలు

గోదారి పరవళ్లు..

మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల ఎత్తిపోతలు షురూ అయ్యాయి. తుక్కాపూర్ పంప్ హౌస్ నుంచి ఎత్తిపోతలను అధికారులు మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటినిల్వ 10.25టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. 30టీఎంసీల నీటిని నింపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రెండు మోటార్లు నడుపుతుండగా బుధవారం నుంచి మరో రెండు మోటార్లు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

–తొగుట(దుబ్బాక)

హస్తవ్యస్తం



గజ్వేల్ కాంగ్రెస్‌లో గ్రూప్ వార్

- ఇటీవల ఇన్‌చార్జి మంత్రి ఎదుటే నేతల బాహాబాహీ
- ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు
- నర్సారెడ్డి, మైనంపల్లి దిష్టిబొమ్మల దహనాలు
- నివేదిక కోసం క్రమశిక్షణ కమిటీ సభ్యుడి నియామకం

గజ్వేల్ కాంగ్రెస్‌లో గ్రూప్ వార్ రచ్చకెక్కుతోంది. సొంత పార్టీ నేతలే ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకునే స్థితికి చేరింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు మధ్య కొంత కాలంగా పోరు నడుస్తోంది. తాజాగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు వర్గం తయారైంది. పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో స్పందించి నివేదిక కోసం క్రమశిక్షణ కమిటీ సభ్యుడు శ్యాంమోహన్‌ను కన్వీనర్‌గా నియమించారు. పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని మల్లు రవి ఆదేశించారు.

– సాక్షి, సిద్దిపేట

ములుగులో గతేడాది డిసెంబర్ 2న కోకాకోలా కంపెనీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. లోపలికి శ్రీకాంత్ రావు అనుచరులను అనుమతించారని.. తన అనుచరులను రానివ్వలేదని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నిరసన తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ఈ నెల 3న రేషన్ కార్డుల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ ఎదుటే కాంగ్రెస్ నాయకులు బాహాబాహీకి దిగారు. నర్సారెడ్డిని వ్యతిరేకిస్తున్న సీనియర్ నాయకుడు నాయిని యాదగిరి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్‌లు ఘర్షణకు దిగారు.

దిష్టిబొమ్మల దహనాలు

కేసుల నమోదు వెనకాల మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హస్తం ఉందని నర్సారెడ్డి వర్గీయులు నిరసనలు చేపడుతున్నారు. కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రాజీవ్ రహదారిపై మైనంపల్లి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు మల్లేశం, రవీందర్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 17న టోల్‌ప్లాజా నుంచి వెలికట్ట క్రాస్ రోడ్డు వరకు నర్సారెడ్డి దిష్టిబొమ్మను ఊరేగింపుగా తీసుకవచ్చి దహనం చేశారు. ఇలా సొంత పార్టీ నేతలే పరస్పర విమర్శలతో రోడ్డెక్కుతూ దిష్టిబొమ్మల దహనానికి పాల్పడుతుండటం గమనార్హం. వర్గాలుగా చీలిపోయిన కాంగ్రెస్ నేతల మధ్య రోజు రోజుకు కలహాలు ముదురుతున్నాయి. విభేదాలు పరిష్కరించడంలో కాంగ్రెస్ అధిష్టానం జాప్యం చేస్తోందని ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

వర్గాలు ఒక్కటయ్యేనా

గజ్వేల్ కాంగ్రెస్‌లో కొంత కాలంగా వర్గపోరు కొనసాగుతోంది. ఈ విషయం పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి పలువురు ఫిర్యాదు చేయడంతో క్రమశిక్షణ కమిటీ సభ్యుడు శ్యాంమోహన్‌ను కన్వీనర్‌గా నియమించారు. 10 రోజుల్లో సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే.. కావాలని ఒక వర్గం కుట్రలకు పాల్పడుతోందని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. మరోవైపు అధిష్టానం ప్రత్యేక దృష్టి పెట్టి వర్గాలను ఒక్కటి చేసి పార్టీని పటిష్ట పరచాలని క్యాడర్ కోరుతోంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు కృషి చేయాలని ఆ పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఫిర్యాదుల పర్వం

గజ్వేల్: కాంగ్రెస్‌లో ఫిర్యాదుల పర్వం కొనసాగుతూనే ఉంది. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డితోపాటు పలువురు నేతలు సోమవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ను కలిసి పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌పై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా మంగళవారం నర్సారెడ్డిని వ్యతిరేకిస్తున్న నేతలు నాయిని యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డితోపాటు పలువురు హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్‌ను కలిశారు. విజయ్‌కుమార్‌పై నర్సారెడ్డి చేసిన ఆరోపణలన్నీ అబద్దాలేనని వివరించారు. పార్టీలో నేతలంతా రెండు వర్గాలుగా చీలిపోయి పరస్పర ఫిర్యాదులు చేసుకుంటున్న నేపథ్యంలో గజ్వేల్ కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందనే అంశంపై అధిష్టానం సీరియస్‌గా దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది.



నర్సారెడ్డిపై పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు అందజేస్తున్న నేతలు

ఉద్యాన ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధిద్దాం



విశ్వవిద్యాలయంలో సెంట్రల్ డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల తదితరులు

- పరిశోధనలు విస్తృతంగా సాగాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

ములుగు(గజ్వేల్): 'ఉద్యాన ఉత్పత్తిలో స్వయం సమృద్ధి కోసం పరిశోధనలపై విశ్వవిద్యాలయాలు దృష్టి సారించాలి. తద్వార ఇతర రాష్ట్రాలపై ఆధార పడటం తగ్గించాలి' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ములుగులోని ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని మంత్రి సందర్శించారు. ఈసందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, కలెక్టర్ హైమావతి, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి, వ్యవసాయ శాఖ సంచాలకులు రఘునందన్‌రావు, రైతు సంక్షేమ కమిషన్ బోర్డు సభ్యురాలు భవానీరెడ్డిలతో కలసి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్మించిన సెంట్రల్ డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు ప్రయోజనం చేకూర్చడానికి, ఉద్యాన ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు స్వయాన పొలాల్లోకి వెళ్లి రైతుల పని విధానాన్ని పరిశీలించాలన్నారు. రాబోయే రోజుల్లో అన్నిరంగాల కంటే వ్యవసాయ రంగానికే అధిక ప్రాముఖ్యత ఉంటుందని మంత్రి తెలిపారు. ఉప్పెనలు, ఉపద్రవాలు వచ్చినా దేశ ప్రజలను బతికించగలిగే ఏకైక రంగం వ్యవసాయమన్నారు. ఉద్యాన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా క్షేత్ర అనుభవాన్ని పొందాలని, రైతులతో చురుకుగా సంభాషించి సాంకేతిక మార్గ దర్శకం అందించాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్‌లు నరేందర్‌రెడ్డి, విజయమోహన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అనంతగిరిపల్లి కుంటకు గండి

యుద్ధప్రాతిపదికన పూడ్చివేత

వర్గల్(గజ్వేల్): కుండపోత వానతో అతలాకుతలమైన వర్గల్ మండలంలో వరద ఇక్కట్లు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం ఉదయం అనంతగిరిపల్లిలోని కిష్టమ్మ కుంటకు భారీ గండి పడింది. గ్రామస్తుల నుంచి సమాచారం అందడంతో పోలీసులతోపాటు ఎంపీడీఓ మచ్చేందర్, ఆర్‌ఐ రాజు, ఇరిగేషన్ ఏఈ అలీ, అక్కడికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. నీటి వృథాకు అడ్డుకట్ట పడేలా జేసీబీ యంత్రాలతో యుద్ధప్రాతిప్రదికన మరమ్మతులు చేపట్టారు. గండి పూడ్చివేశారు. కాగా వర్గల్ మండలంలో మంగళవారం 3.18 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో ఇంకా పొలాల్లో వరద వీడలేదు.



అనంతగిరిపల్లిలో కిష్టమ్మ కుంట గండి పూడుస్తున్న సిబ్బంది

ఇందిరమ్మ ఇళ్లలో అధికారుల చేతివాటం

వాటా ఇవ్వాల్సిందేనంటూ మేస్త్రీలకు అల్టిమేటం

సిద్దిపేటరూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకం అక్రమార్కులకు వరంగా మారుతోంది. పారదర్శకంగా ఇంటి నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన శాఖ అధికారులే పక్కదారి పడుతున్నారు. గృహాలను నిర్మించే మేస్త్రీలను సైతం వదలడం లేదు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం నుంచి తమకు వాటా ముట్టజెప్పాల్సిందేనంటూ మేస్త్రీలకు సదరు ఏఈ అల్టిమేటం జారీ చేసినట్లు వినికిడి. మండల పరిధిలోని హౌసింగ్ ఏఈ.. ఇంటికి రూ.3వేల చొప్పున డబ్బులు డిమాండ్ చేసినట్లు సమాచారం. రూరల్ మండలంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన వెంకటాపూర్‌లో 183 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. ఈ క్రమంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న మేస్త్రీకి ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో.. చేసేదిలేక మేస్త్రీ రూ.5 వేలు గూగుల్ పే చేశారు. మిగతా డబ్బులు వారంలో ఇవ్వాలని సదరు ఏఈ.. మేస్త్రీని ఆదేశించాడు. డబ్బులు పంపించిన అనంతరం బాధితుడు 'సాక్షి'ని ఆశ్రయించి తనగోడు వెల్లబోసుకున్నాడు.ఈ విషయంపై హౌసింగ్ ఏఈని వివరణ కోరగా తాను ఎవరినీ డబ్బు డిమాండ్ చేయలేదంటూ బుకాయించాడు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హైమావతి
- దిలాల్‌పూర్‌లో తెగిపోయిన కొండపోచమ్మసాగర్ కాల్వ పరిశీలన

గజ్వేల్: భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హైమావతి సూచించారు. మంగళవారం గజ్వేల్ మండలం దిలాల్‌పూర్‌లో తెగిపోయిన దౌల్తాబాద్‌వైపు వెళ్లే కొండపోచమ్మసాగర్ కాల్వను పరిశీలించారు. కాల్వ నీళ్లు పొలాల గుండా కుంటలోకి వెళ్తున్నాయని ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరించగా వెంటనే కాల్వ పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో వరద ఉధృతి పెరిగి చెరువులు, కుంటలు, కాల్వలు తెగిపోయే ప్రమాదమున్నందువల్ల ఇరిగేషన్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

వరదలో వాగులను దాటొద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను ఎట్టి పరిస్థితుల్లో దాటే ప్రయత్నం చేయవద్దని కలెక్టర్ హైమావతి కోరారు. మంగళవారం అల్వాల శివారు కూడవెల్లి వాగుపై ఉన్న లో లెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీటిని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ లో లెవల్ బ్రిడ్జిలపై నుంచి ప్రవహిస్తున్న వాగుల వద్ద ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.



తెగిపోయిన సాగర్ కాల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

నర్సరీ పరిశీలన

ములుగు(గజ్వేల్): స్థానిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫ్రూట్స్, రైతు శిక్షణ కేంద్రంలోని నర్సరీలను కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కూరగాయలు, పండ్లు, పూలు ఇతరత్ర మొక్కలు సాంకేతిక పద్ధతి ద్వారా మొలిచే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. దేశీరకం వంగడాలతో కూడిన మొక్కలను నర్సరీలలో పెంచాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వాల వైఫల్యమే కారణం

- సకాలంలో యూరియా సరఫరా చేయాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): యూరియా కొరతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. యూరియా కొరత సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సకాలంలో రైతులకు యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలుకు ముందు చూపు లేకనే యూరియా కొరత ఏర్పడుతోందని విమర్శించారు. రైతులు యూరియా కోసం పస్తులతో పోరాటం చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. వెంటనే యూరియా కొరతను తీర్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కమలాకర్‌రెడ్డి, సోలిపేట సతీష్ రెడ్డి, మాజీ ఎంపీపీ నమిలె భాస్కరాచారి, మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండీ. అహ్మద్, నాయకులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: ఇబ్రహీంనగర్ వద్ద బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాజీవ్ రహదారిపై బీఆర్‌ఎస్ రాస్తారోకో

చిన్నకోడూరు(సిద్దిపేట): యూరియా కొరత నివారించాలంటూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంనగర్ వద్ద రాజీవ్‌రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. గంట పాటు నిర్వహించడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువుల సరఫరాలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్‌లు, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో బారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): వరిసాగుకు అవసరమైన యూరియా సరఫరా లేక రైతులు అవస్థలు పడుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రానికి స్టాక్ రావడంతో రైతులు అక్కడికి చేరుకున్నారు. దీంతో తీవ్ర రద్దీ ఏర్పడింది. రైతులు తమ వంతుకోసం గంటల కొద్దీ నిరీక్షించారు. పోలీసు బందోబస్తు నడుమ యూరియా పంపిణీ చేశారు.

క్లుప్తంగా

చందుకు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న చందు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేర్గు గ్రామానికి చెందిన గదరాజు చందు తెలుగు విభాగంలో డాక్టరేట్ పట్టా పొందాడు. మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన 84వ స్నాతకోత్సవంలో ఓయూ చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్, వైస్ చాన్సలర్ కుమార్ ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అనంతరం చందును పలువురు ప్రొఫెసర్లు, స్నేహితులు అభినందించారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి : పీఆర్‌టీయూ



మాట్లాడుతున్న తులసీరాం రాథోడ్

జహీరాబాద్ టౌన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరాం రాథోడ్ ఉపాధ్యాయులను కోరారు. పట్టణంలోని బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన టీచర్ల శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహాధర్నా ఉందని, ఉపాధ్యాయులు సెలవు పెట్టి ధర్నాలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు శ్రీశైలం, తుకారాం, ఆనంద్, ఆశోక్, వరాలు, ప్రదీప్‌కుమార్, స్వామిదాస్ పాల్గొన్నారు.

ఇల్లు కూలి వ్యక్తికి గాయాలు



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

నర్సాపూర్ రూరల్: ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని పెద్ద చింతకుంటలో ఇల్లు కూలి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పారట్ల శ్రీనివాస్ సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లు కూలి దూలం అతడి తలపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. మరో ఆరు మంది బయటకు పరుగులు తీశారు. వెంటనే అతడ్ని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఎంపీడీఓ మధులత, ఎంపీఓ శ్రీనివాసులు మంగళవారం గ్రామానికి వెళ్లి శ్రీనివాస్ ఇంటితో పాటు పక్కనే ఉన్న మరికొన్ని ఇళ్లను ఖాళీ చేయించి, ఇతర ఇండ్లకు తరలించారు. మండల వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు 26 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

రెండు కాళ్లు కోల్పోయా ఆదుకోండి



చిన్నశంకరంపేట(మెదక్): రెండేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయానని ప్రభుత్వం ఆదుకోవాలని నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన చెప్యాల సిద్దిరాములు వేడుకున్నారు. కన్పించిన నాయకులు, అధికారులను తనకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని అడిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండేళ్లుగా నడవలేక నరకయాతన అనుభవిస్తున్నానని, కనీసం తనకు వీల్‌చైర్ అయినా ఇవ్వాలని కోరాడు. ఏ పని చేయలేకపోతున్నానని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

విషపునీరు తాగి పది మేకలు మృతి



మృత్యువాత పడిన మేకలు

తొగుట(దుబ్బాక): పది మేకలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని లింగాపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు... గ్రామానికి చెందిన బెస్త లింగం, ఎరుకుల అంజయ్య మేకలను పోషించుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో రోజు మాదిరిగా మేకలను తోలుకుని మధ్యాహ్నం మేతకు వెళ్లారు. మేత తిని పంటచేళ్ల సమీపంలో నీళ్లు తాగాయి. మేకలు నీటిని తాగిన కొద్దిసేపటికే తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. కాపరులు, గ్రామస్తులు పశువైద్యాధికారికి ఫోన్‌లో సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకునే లోపు పది మేకలు మరణించాయి. వెంటనే వైద్య బృందం అప్రమత్తమై మిగతా మేకలకు వైద్యం అందించగా వాటి ఆరోగ్యం నిలకడగా ఉంది.

ముస్తాబవుతున్న గణనాథులు

- ఆకర్షణీయంగా విగ్రహాలు
- రంజోల్‌లో పెద్ద ఎత్తున తయారీ
- రంగులద్దుతున్న రాజస్తాన్ కళాకారులు
- సైజు, రూపం ఆధారంగా ధరలు



రంజోల్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

జహీరాబాద్ టౌన్: వినాయకుడి పండగ వస్తుందంటే చాలు చిన్న, పెద్ద, పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా మండపాలు ఏర్పాటు చేసుకుని విగ్రహాలను ప్రతిష్టిస్తుంటారు. అప్పుడే వారం రోజుల ముందే సందడి మొదలైంది. వినాయక చవితి పర్వదినానికి గణపయ్య విగ్రహాలు సిద్ధం అవుతున్నాయి. విగ్రహాలను రాజస్తాన్‌కు చెందిన కళాకారులు ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. అందంగా ఉండటానికి రంగులద్ది మెరుపులు అద్దుతున్నారు. మండపాల నిర్వాహకులు వచ్చి అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్నారు.

జహీరాబాద్ ప్రాంతంలోని రంజోల్ వద్ద దూల్‌పేటలో మాదిరిగా పెద్ద ఎత్తున విగ్రహాలను తయారు చేస్తున్నారు. పది మంది కళాకారుల కుటుంబాలు వేసవి నుంచి తయారీ ప్రక్రియను ప్రారంభించారు. ఇక్కడ తయారైన విగ్రహాలను జిల్లాతో పాటు హైదరాబాద్, పొరుగున ఉన్న కర్నాటక, మహారాష్ట్రకు తరలిస్తున్నారు. కొంత మంది మండపాల నిర్వాహకులు ముందుగా ఆర్డర్ ఇచ్చి తమకు నచ్చిన నమూనాలో విగ్రహాలను తయారీ చేయించుకుంటారు. వినాయక చవితి ఇంకా వారం రోజులు ఉండగా అప్పుడే విగ్రహాల కొనుగోళ్ల సందడి మొదలైంది.

సైజును బట్టి ధరలు

విగ్రహాల సైజు, రూపం బట్టి ధరలు నిర్ణయించి అమ్ముతున్నారు. రంజోల్ వద్ద 3 నుంచి 15 అడుగుల విగ్రహాలను తయారు చేస్తున్నారు. రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. సుమారు ఐదారు కార్ఖానాల్లో ఉండగా ఒక్కో దాంట్లో 150కి పైగా విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఆర్డర్లపై కోరిన సైజులో విగ్రహాలను తయారు చేసి ఇస్తారు.



పీఓపీతో విగ్రహాల తయారీ

రాజస్తాన్ కళాకారులు విగ్రహాల తయారీకి పెట్టింది పేరు. కుటుంబ సభ్యులంతా సుమారు 10 నెలల పాటు విగ్రహాలను పీఓపీతో తయారు చేస్తారు. కొందరూ విగ్రహాలను తయారు చేస్తుంటే మహిళలు, పిల్లలు రంగులు దిద్దుతారు. ఈ నెల 27న వినాయక చవితి పండగ ఉన్నందున కొనుగోళ్ల సందడి ప్రారంభమైంది.

విగ్రహాలతోనే ఉపాధి

వినాయక విగ్రహాల తయారీతోనే ఉపాధి పొందుతున్నాం. కుటుంబ సభ్యులంతా ఇక్కడే ఉంటూ రాత్రింబవళ్లు కష్టపడుతాం. తయారీ ఖర్చులు పెరిగాయి. ఆశించిన మేర లాభాలు రావడం లేదు. ఈ సారి అమ్మకాలు పెరుగుతాయని ఆశిస్తున్నాం. పుణే, ముంబయి తరహా కొత్త మాడల్స్ డిమాండ్‌పై తయారు చేస్తున్నాం. ప్రతిమలు తీసుకునేందుకు జహీరాబాద్‌తో పాటు కర్నాటక రాష్ట్రంలోని బీదర్, ఉమ్నబాద్, బాల్కీ తదితర ప్రాంతాల ప్రజలు వస్తారు.

– ముఖేశ్, రాజస్తాన్ కళాకారుడు

వర్గల్ క్షేత్ర నిర్వహణ అద్భుతం

కంచి పీఠాధిపతి ప్రశంసలు



తిరుపతిలో కంచి పీఠాధిపతితో వర్గల్ క్షేత్ర బృందం

వర్గల్(గజ్వేల్): కంచి పీఠం ఆధ్వర్యంలోని వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్ర నిర్వహణ అద్భుతమని కంచి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి ప్రశంసించారు. తిరుపతి క్షేత్రంలోని మహాపాదుకా కంచి మఠంలో చతుర్మాస్య దీక్షలో ఉన్న స్వామివారిని మంగళవారం వర్గల్ క్షేత్ర వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో అభివృద్ధి కమిటీ బృందం కలిసి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా క్షేత్ర నిర్వహణ, చేపడుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికను స్వామివారికి వివరించారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

హత్నూర(సంగారెడ్డి): పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీధర్ రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సోమవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో 14 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.లక్ష 80 వేల 650 , 13 సెల్‌ఫోన్లు, మూడు కార్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు మోదు చేసి న్యాయస్థానంలో హాజరు పర్చారు.

ఒక చిత్రం వేయి పదాలకు సమానం

కలెక్టర్ రాహుల్ రాజ్



ఫొటోగ్రాఫర్ ప్రదీప్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: ఒక ఛాయా చిత్రం వేయి పదాలకు అర్థం చెబుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో డీపీఓ కార్యాలయంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న ప్రదీప్‌ను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఫొటోగ్రాఫర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. డీఎల్‌పీఆర్‌ఓ రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

దాబాలు, రైల్వేస్టేషన్ తనిఖీ



ప్రయాణికుని బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని దాబాలు, రైల్వే స్టేషన్‌లో భద్రతా చర్యల్లో భాగంగా బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మనోహరాబాద్ రైల్వే స్టేషన్, దాబాల్లో తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించినా, వస్తువులు, పార్శిల్ కనిపించినా తమ దృష్టికి తేవాలన్నారు.

విపత్తులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పటాన్‌చెరు టౌన్: విపత్తులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, శ్రీ సత్య సాయి సేవ ఆర్గనైజేషన్ 'విపత్తు నిర్వహణపై 'ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... నీరు, భౌగోళిక , మానవ నిర్మిత, జీవ సంబంధిత, పారిశ్రామిక, అను సంబంధిత విపత్తులు మనకు ఏర్పడతాయని, వాటిపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. విపత్తుల వల్ల జరిగే నష్టాలను పీపీటీ ద్వారా రాష్ట్ర స్థాయి విపత్తు నిర్వహణ కమిటీ ఇన్‌చార్జి శ్రీకృష్ణ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటేశం, డాక్టర్ కరుణా కుమారితోపాటు అధ్యాపకులు ప్రవీణ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ యోగిబాబు, డాక్టర్ మల్లిక, డాక్టర్ సుజాత, డాక్టర్ మంజు శ్రీ, డాక్టర్ విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం



గంజాయి మొక్కలను చూపుతున్న అధికారులు

నారాయణఖేడ్: గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఎక్సైజ్ శాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ శంకర్, ఎస్ఐలు హనుమంతు, అనుదీప్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నాగల్‌గిద్ద మండలం శ్యామానాయక్ తండాకు చెందిన పీరూనాయక్ పత్తిచేనులో అంతర పంటగా గంజాయి సాగు చేసినట్లు గుర్తించారు. 105 మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు కోసం ఖేడ్ ఎక్సైజ్ శాఖ సీఐ కార్యాలయంలో అందజేశారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక బలవన్మరణం

ఝరాసంగం(జహీరాబాద్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటకలోని హుమ్నాబాద్ నియోజకవర్గం, కనకట్ట గ్రామానికి చెందిన మాధవగిరి(34) ఇస్నాపూర్‌లోని ఓ పరిశ్రమలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఐదేళ్ల క్రితం బసవ కల్యాణ్ గ్రామంలో ఓ వ్యక్తి వద్ద రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో తీసుకున్న అప్పు చెల్లించలేక మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. గత బుధవారం వెళ్లిపోయిన అతడు మంగళవారం మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామ శివారులోని ఓ పురాతన దాబాలో ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పు తీర్చలేక..

జహీరాబాద్: అప్పుల బాధతో మనోవేదనకు గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మొగుడంపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ధనసిరి గ్రామానికి చెందిన నర్సప్ప తన కుమార్తె వివాహానికి సంఘాల వద్ద అప్పు తీసుకున్నాడు. ఆ అప్పు తీర్చేందుకు గాను నర్సప్ప భార్య ఝర్నమ్మ, చిన్న కుమారుడితో కలిసి కూలీ పనుల కోసం ముంబయికి వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి వద్ద నర్సప్ప పెద్ద కుమారుడు పరశురాంతో(21) కలిసి కూలీ పనులు చేస్తున్నారు. చేసిన అప్పు తీర్చే దారి కనిపించకపోవడంతో పరశురాం సోమవారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. కేసు నమోదు చేశారు.

చేపల వలలో చిక్కిన కొండ చిలువ



వలలో చిక్కిన కొండ చిలువ

నర్సాపూర్ : ఇటీవల భారీగా కురుస్తున్న వర్షాలకు రాయరావు చెరువు నీటితో నిండుకుండలా ఉంది. మత్స్యకారులు చెరువులో చేపలు పట్టేందుకు వలలు ఏర్పాటు చేసి వేట కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం వల వేసిన కొంత సేపటికి చూడగా కొండ చిలువ చిక్కింది. దీంతో మత్స్యకారులు అటవీ శాఖ రేంజ్ అధికారి అరవింద్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన స్పందించి ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ ప్రతినిధుల సహకారంతో కొండ చిలువను సంరక్షణ కేంద్రానికి తరలించనున్నట్లు తెలిపారు. అటవీ అధికారి అరవింద్ వెంట సెక్షన్ ఆఫీసర్ సాయిరాం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను కాపాడిన కానిస్టేబుల్



చెరువులో దూకిన మహిళను కాపాడి గట్టుకు చేర్చిన కానిస్టేబుల్ స్వామి

చేర్యాల(సిద్దిపేట): చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను కానిస్టేబుల్ కాపాడాడు. ఈ ఘటన పట్టణ శివారులో చోటు చేసుకుంది. కానిస్టేబుల్ స్వామి, స్థానికుల వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన పాక రాణి కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంటి నుంచి వచ్చేసి చనిపోదామని చెరువులో దూకింది. అదే సమయంలో కట్టపై మార్నింగ్ వాక్ చేస్తున్న కానిస్టేబుల్ స్వామి వెంటనే చెరువులోకి దూకి ఆమెను కాపాడి మానవత్వం చాటుకున్నాడు. మహిళ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ స్వామిని సీపీ అనురాధ, హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ నవీన్, పట్టణ ప్రజలు అభినందించారు. త్వరలో స్వామికి నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు.

దొరకని ఆచూకీ

- జవాన్ అదృశ్యమై..11రోజులు
- ఆందోళనలో కుటుంబ సభ్యులు



ఆర్మీ జవాన్ అనిల్

కొమురవెల్లి(సిద్దిపేట): ఆర్మీ జవాన్ ఆచూకీ లభించకపోవడంతో 11 రోజులుగా కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన తోట అనిల్ పదకొండేళ్ల క్రితం ఆర్మీలో చేరాడు. ప్రస్తుతం పంజాబ్‌లోని అంబాలలో విధులు నిర్వహిస్తున్నాడు. జూలైలో ట్రెనింగ్ నిమిత్తం సికింద్రాబాద్‌కు వచ్చాడు. ట్రెనింగ్ పూర్తయిన తర్వాత సెలవుపై అయినాపూర్‌లోని ఇంటికి వచ్చాడు. ఈనెల 6న విధుల్లో చేరేందుకు పంజాబ్‌లోని అంబాలకు వెళ్లాడు. 8వ తేదీన ఉదయం ఆర్మీ క్యాంపులో రిపోర్టు ఇచ్చి ఇంటికి ఫోన్ చేసి విధుల్లో చేరినట్టు తెలిపాడు. అదే రోజు సాయంత్రం మళ్లీ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి నేను చనిపోతున్నాను అని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు పంజాబ్‌లో ఆర్మీ అధికారులను సంప్రదించగా మొదట అతడు డ్యూటీలో ఉన్నాడని, తర్వాత అతడు అదృశ్యమైనట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు సిద్దిపేట సీపీ అనురాధను కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలువగా ఆచూకీ త్వరగా కనుగొనాలని పంజాబ్ పోలీసులను ఫోన్‌లో ఆదేశించారు. తన కొడుకు ఆచూకీ త్వరగా కనిపెట్టాలని అనిల్ తల్లి మంగమ్మ ప్రభుత్వాలను కోరుతున్నారు. కాగా అనిల్ మిస్సింగ్‌పై ఫిర్యాదు చేశారని, పంజాబ్‌లో అక్కడి అధికారులతో మాట్లాడితే మిస్సింగ్ కేసు నమోదైనట్లు చెప్పారని ఎస్ఐ రాజు తెలిపారు.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి..

బావిలో పడి వ్యక్తి మృతి



రఘు

జహీరాబాద్: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... చిరాగ్‌పల్లి గ్రామానికి చెందిన సోలాపూర్ రఘు(40) సోమవారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామం సమీపంలో వెతుకుతుండగా ఎల్లమ్మ బావి దగ్గర బురదలో చెప్పులు కనిపించాయి. అనుమానంతో బావిలో పాతాళ గరిగే సహాయంతో వెతకగా మృతదేహం లభించింది. బావిలో నీటిని తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు పడి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య మీనాక్షి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తీవ్ర జ్వరంతో యువకుడు మృతి

చిన్నశంకరంపేట(మెదక్): జ్వరంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో జరిగింది. వివరాలు ఇలా... ఎస్.కొండాపూర్ మధిర గ్రామమైన ప్యాటగడ్డకు చెందిన మాడబోయిన స్వామి(20) రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో అతడికి ఫిట్స్‌తోపాటు ప్లేట్‌లెట్స్ తగ్గుతుండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. తీసుకెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో అతడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా యువకుడు జ్వరంతో బాధపడుతూ ఫిట్స్ రావడంతోనే మృతి చెందాడని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధూ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



రాజు

చిన్నశంకరంపేట(మెదక్): వ్యక్తి అదృశ్యమైన ఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సృజన కథనం మేరకు... మండల కేంద్రానికి చెందిన పులిశెట్టి రాజు కామారెడ్డిలో ఫంక్షన్ ఉందని చెప్పి ఆదివారం బయలుదేరారు. ఇదే ఫంక్షన్‌కు రాజు భార్య శ్యామల కూడా వెళ్లింది. కాని భర్త ఫంక్షన్‌కు రాలేదు. సోమవారం నార్సింగికి వచ్చిన శ్యామలకు భర్త కన్పించలేదు. బంధువులు , తెలిసిన వారి వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యూనిఫామ్ తిప్పలు

కురచ దుస్తులతో విద్యార్థుల అవస్థలు



పొట్టి దుస్తుల్లో విద్యార్థులు

- జిల్లాలోని సర్కారు బడుల్లో 84 వేల మంది పిల్లలు
- పట్టించుకోని అధికారులు

తూప్రాన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సర్కారు పంపిణీ చేసిన యూనిఫామ్‌లు సరిగా లేక వాటిని ధరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు పోటీగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామంటూ ఊదరగొడుతూ ప్రచారం చేస్తున్నప్పటికీ ఆచరణలో విఫలమైంది. ముఖ్యంగా యూనిఫారాల సరఫరాలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో కురుచ దుస్తులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రతి యేటా రెండు జతల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంది. జిల్లాలోని 922 ప్రభుత్వ పాఠశాలల్లో 84 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. రూరల్ ప్రాంతాల్లోని పాఠశాలలకు డీఆర్‌డీఏ, అర్బన్ ప్రాంతాల్లో తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట, మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలకు మెప్మా పరిధిలో యూనిఫాంలు అందజేస్తున్నారు. విద్యార్థులకు పంపిణీ చేసిన యునిఫారాలు కొలతలకు అనుగుణంగా లేవని దీంతో ధరించలేకపోతున్నామని వాపోతున్నారు. పొట్టి దుస్తులతోనే పాఠశాలలకు హాజరవుతున్నారు. గతంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా యునిఫారాల క్లాత్‌ను ఎంఆర్‌సీ కేంద్రాలకు పంపించేవారు. వాటిని విద్యార్థుల కొలతలను బట్టి పాఠశాల స్థాయిలో టైలర్స్‌తో కుట్టించి పిల్లలకు అందించేవారు. ఇందుకు ఒక్కో జత కుట్టినందుకు ప్రభుత్వం రూ.40 చెల్లించేది. కాని రెండేళ్లుగా సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా విద్యార్థులకు కావాల్సిన క్లాత్‌ను సరఫరా చేస్తుంది. గతంలో కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేసి స్వయం సహాయక సంఘాల ద్వారా యునిఫాంలు కుట్టిస్తున్నారు. ఒక్కో జతకు రూ.75 చొప్పున చెల్లిస్తున్నారు. కానీ తరగతుల వారీగా యూనిఫాం కుట్టడం ద్వారా ఒక తరగతిలో ఒక విద్యార్థి పొడవుగా, మరొకరు చిన్నగా ఉండటంతో సరిపోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాతది వేసుకుంటున్న



మా పాఠశాలలో ఉపాధ్యాయులు యూనిఫామ్ ఇచ్చారు. అది వేసుకుంటే చాలా ఇబ్బందిగా ఉంది. పాతది వేసుకుని బడికి పోతున్నాం. మా కొలతలకు తగ్గట్టుగా మంచిగా కుట్టి ఇవ్వాలి.

– విజయ్, 10వ తరగతి విద్యార్థి

చిన్నగా ఉంది



పాఠశాలలో ఇచ్చిన యూనిఫామ్ చిన్నదిగా ఉంది. అది వేసుకోవడానికి రావడం లేదు. ఉపాధ్యాయులేమో రోజు యూనిఫామ్ వేసుకుని రమ్మంటున్నారు. సరైన కొలతలతో కుట్టి తిరిగి మళ్లీ ఇవ్వాలి.

– ప్రణయ్, 7వ తరగతి, విద్యార్థి

చర్యలు తీసుకుంటాం

విద్యార్థులకు పంపిణీ చేసిన యునిఫారాలు కొలతల్లో హెచ్చుతగ్గులు వచ్చిన వాటిని గుర్తించి తిరిగి సరిచేసి ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గుర్తించి వివరాలు అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనిఫాంల తయారీ విషయంలో శిక్షణ ఇప్పించాం. అనుభజ్ఞులతోనే తయారీ చేయిస్తున్నాం.

– హన్మంత్‌రెడ్డి, జిల్లా మెప్మా అధికారి, మెదక్